



# కరపత్రం

SINCE 2014

గురువారం జనవరి 2 2025 | సంపుటి :0 | సంచిక : 82 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## నూతన సంవత్సర వేడుకలు..

### హైదరాబాద్‌లో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మంగళవారం భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,184 కేసులు నమోదయ్యాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 619 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. ఆకతాయిలు, మందుబాబులపై దృష్టి సారించారు.




## సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు: జనవరి 2 నుంచి బుకింగ్



ఇంటర్నెట్ డెస్క్: సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్లాలనుకొనేవారికి గుడ్‌న్యూస్. పండగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ఆరు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. కాచిగూడ -కాకినాడ టౌన్‌బీ హైదరాబాద్- కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్లు జనవరి 9, 10, 11, 12 తేదీల్లో రాకపోకలు సాగించనున్నాయి. ఈ రైళ్లకు టికెట్ రిజర్వేషన్ల బుకింగ్ సదుపాయం జనవరి 2వ తేదీ ఉదయం 8గంటల నుంచి అందుబాటులో ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయని పేర్కొన్నారు. కాచిగూడ - కాకినాడ టౌన్ రైలు (07653) జనవరి 9, 11 తేదీల్లో రాత్రి 8.30గంటలకు కాచిగూడలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8గంటలకు కాకినాడ పట్టణానికి చేరుకోనుంది. అలాగే, కాకినాడ టౌన్ -కాచిగూడ రైలు (07654) ఈ నెల 10, 12 తేదీల్లో కాకినాడలో సాయంత్రం 5.10గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయాన్నే 4.30గంటలకు కాచిగూడకు చేరుకోనుంది. ఈ రైళ్లు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం,

## మాదాపూర్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో అగ్ని ప్రమాదం

హైదరాబాద్: మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ఓ వాణిజ్య సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. భవనం ఐదో అంతస్తులోని నిపున్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో కార్యాలయంలోని సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిబూడిదయ్యాయి. వాణిజ్య సముదాయంలో మంటలు చెలరేగడంతో మిగిలిన కార్యాలయాల్లోని సిబ్బంది ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు.



# విశ్వవేదికపై విజయ గీతికగా తెలంగాణ ప్రస్థానం ఉండాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "నవ వసంతంలో విశ్వవేదికపై విజయ గీతికగా తెలంగాణ స్థానం, ప్రస్థానం ఉండాలి. ప్రతి ఒక్కరి జీవితంలో ఈ నూతన సంవత్సరం శుభ సంతోషాలను నింపాలని మనసారా కోరుకుంటున్నా. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## నగర వాసులకు తీపి కబురు.. మేడ్చల్, శామీర్‌పేట్‌కు మెట్రో పొడిగింపు



మిగతాది 2లో

రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది.

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది. హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి .. ప్యారడైజ్- మేడ్చల్ (23 కిలోమీటర్లు), జేబీఎస్-శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్ల డీపీఆర్‌ల తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంటనే డీపీఆర్‌లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్-2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు.

## ఈ ఏడాది ఉప ఎన్నికలు రావొచ్చు.. సంచలన వ్యాఖ్యలు చేసిన కేటీఆర్

- రాష్ట్రంలో ఈ ఏడాది ఉప ఎన్నికలు రావొచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు.
- తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.
- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకుంటారని తాము భావిస్తున్నామన్నారు.



స్పీకర్ తేల్చకపోతే ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఈ ఏడాది ఉప ఎన్నికలు రావొచ్చన్నారు.


అవినీతి లేని మొదటి కేసు..

ఫార్ములా-ఈ రేస్‌లో ఒక్క పైసా అవినీతి జరుగలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పని.. ఈ కేసులో ఏమాత్రం పసలేదన్నారు. అవినీతి లేనప్పుడు కేసు ఎక్కడిదంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఏసీబీ పెట్టిన కేసులో అవినీతి లేని మొదటి కేసు ఇదేనన్నారు. కోర్టులో కేసు విషయంలో వాదనలు జరిగిన సమయంలో న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానమే లేదన్నారు. ఫార్ములా ఈ రేసు కేసు ఓ లొట్టపీసు కేసు అంటూ సెటైర్లు వేశారు. తనను ఎలాగోలా జైలుకు పంపాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని.. అందులో భాగమే ఫార్ములా-ఈ రేస్ కేసుతో ఆరో విఫలప్రయత్నం చేశారని విమర్శించారు. కేసుతనను ఎలాగోలా జైలుకు పంపాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని,

మిగతాది 2లో

## రైతు భరోసా విషయంలో..

### రైతులను నేరస్తులుగా భావించడం దారుణం : హరీశ్‌రావు



- రైతు భరోసా విషయంలో కూడా రైతులను నేరస్తులుగా భావించడం దారుణమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు.
- సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.
- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- రేవంత్ రెడ్డి విజయవంతంగా రైతుబంధును ఎగ్గొట్టి, రైతు భరోసాకు కోతలు పెట్టేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని విమర్శించారు.
- వ్యవసాయ మంత్రి, ఆర్థిక మంత్రి, సీఎం రైతు భరోసాకు కోతలు పెట్టేందుకు కుస్తీ పడుతున్నారన్నారు.
- ఇదే రేవంత్ రెడ్డి గతంలో రైతుబంధు ఏడాదికి మూడుసార్లు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారని గుర్తు చేశారు.

మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జనవరి 2 2025

# సంపాదకీయం

## కొన్ని ప్రశ్నలతో కొత్త ఏడాదిలోకి..!

'ఈ దేశం ఎటు పోతుందో అని భయమేస్తోంది. ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు. ప్రతి ఒక్కరూ అవినీతికి పాల్పడుతున్నారు. మనుషులకు డబ్బే ప్రధానమైంది. ఎవరి గురించి ఏ ఆరోపణ వస్తుందో చెప్పలేకుండా ఉన్నాం. చాలా బాధ కలుగుతోంది. ఈ దుస్థితి చూసి నాకు మనశ్శాంతి కరువైంది. మా పిల్లలైతే ఈ వయస్సులో విశ్రాంతి తీసుకొమ్మని కోరుతున్నారు' అని 2013 మే 8న అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నిర్వేదం వ్యక్తపరిచారు. మాజీ ఎంపీ, అంతకు ముందు రాజ్యసభలో తనకు సహచరుడుగా ఉన్న యలమంచిలి శివాజీ తనను పార్లమెంట్‌లో కలుసుకున్నప్పుడు మన్మోహన్ తన ఆవేదన వెళ్లగక్కారు. బొగ్గు బ్లాకుల కేటాయింపులు, 2జీపై జేపీసీ ముసాయిదా నివేదిక, తెలంగాణ తదితర అంశాలపై పార్లమెంట్ అట్టుడికి పోతున్న రోజులవి. 'మీరు విశ్రాంతి తీసుకుంటే మీకంటే నిజాయితీ గల నాయకుడు దేశానికి మరెవరు దొరుకుతారు?' శివాజీ ఆయనతో అన్నారు. 'మనం నిజాయితీగా ఉన్నామన్నా నమ్మేదెవరు?' అని మన్మోహన్ వ్యాఖ్యానించారు. 'కార్పొరేట్ సంస్థలే అన్నీ నిర్ణయిస్తున్నాయి' అని ఆయన వాపోయారు. యూపీఏ ప్రభుత్వం పదవీకాలం మరో ఏడాది ఉందనగా మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలవి. దేశంలో ఏడాది తర్వాత జరిగే పరిణామాలను మన్మోహన్ అప్పటికే ఊహించారనడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనం. మన్మోహన్‌తో మాట్లాడి వచ్చిన తర్వాత శివాజీ సెంట్రల్ హాలులో ఆంధ్రజ్యోతి ప్రతినిధికి ప్రధానితో తన సంభాషణను పంచుకున్నారు. మరునాడు 'దేశం ఎటుపోతోంది?' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతి మొదటి పేజీలో వార్త వచ్చింది. ఇది సంచలనం సృష్టించడంతో ప్రధానమంత్రి కార్యాలయం ఆంధ్రజ్యోతి ప్రతులను తెప్పించుకున్నది. నిజానికి అప్పుడున్న పరిస్థితుల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించేవే. కాని మన్మోహన్ సింగ్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఈ వార్తను ఖండించలేదు. మన్మోహన్ సింగ్ ప్రజాస్వామిక దృక్పథానికి, ఆయనలో కూడా పీవీ మాదిరి 'లోపలి మనిషి' ఉన్నాడని చెప్పేందుకు ఇది నిదర్శనం.'కాంగ్రెస్ పార్టీలో రెండు అధికార కేంద్రాలు ఉండడానికి వీలు లేదు. నేను ఒక ప్రభుత్వాధినేతగా పార్టీకి అనుగుణంగా నడుచుకోవాలి' అని భావించిన మన్మోహన్ సింగ్ ప్రధానిగా తనకిష్టం లేని పనులు ఎన్ని జరిగినా పెదవి విప్పలేదు. పార్టీ విస్తృత ప్రయోజనాల కోసం ఆయన మౌనం పాటించేవారు. అయితే అదే సమయంలో తనను ఆర్థిక మంత్రిగా నియమించిన తన రాజకీయ గురువు పీవీ నరసింహారావును ఆయన తరుచూ కలుసుకునేవారు. పీవీ లేకపోతే తాను రాజకీయాల్లోకి వచ్చే వాడిని కానని ఆయన పలు సందర్భాల్లో అంగీకరించారు. పీవీ మరణానంతరం ఏపీ భవన్‌లో ప్రతి ఏడాది నిర్వహించే సంస్మరణ సభకు ఎవరు హాజరు కాకపోయినా ఆయన మాత్రం వచ్చి వెళ్లేవారు. తన హయాంలో కేంద్రమంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డితో ఆయన సత్సంబంధాలు కొనసాగించేవారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు 1993లో జరిగిన స్టాక్ మార్కెట్ కుంభకోణంపై నియమించిన జేపీసీలో తనపై వ్యాఖ్యలు చేసేందుకు జైపాల్ కారకుడని తెలిసినప్పటికీ ఆయన జైపాల్‌తో సన్నిహితంగా కొనసాగుతూ తన ఆలోచనలు పంచుకునేవారు. రాంనివాస్ మీర్ధా చైర్మన్‌గా ఉన్న ఈ జేపీసీ మన్మోహన్ సింగ్‌కు క్లీన్‌చిట్ ఇచ్చినప్పటికీ స్టాక్ మార్కెట్‌లో ఉత్థాన పతనాలను పట్టించుకోకుండా ఆర్థిక మంత్రి మొద్దు నిద్రలో ఉండడం సరైంది కాదనే వ్యాఖ్యను జైపాల్ చేర్చారు. జైపాల్ వాడిన 'స్లంబర్' (మొద్దు నిద్ర) అనే పదం మన్మోహన్ సింగ్‌కు బాధ కలిగించడంతో తన పదవికి రాజీనామా చేశారు. కాని పీవీ ఆయనకు నచ్చచెప్పి రాజీనామాను తిరస్కరించారు. అదే మన్మోహన్ సింగ్ కాంగ్రెస్‌పై కార్పొరేట్ సంస్థల ఒత్తిడి రీత్యా జైపాల్ రెడ్డిని పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖకు మార్చినప్పుడు స్వయంగా జైపాల్‌తో మాట్లాడి మనస్తాపం చెందవద్దని కోరారు. యూపీఏ ప్రభుత్వం గద్దె దిగిన తర్వాత జైపాల్ రచించిన 'టెన్ ఐడియాలజీస్' పుస్తకాన్ని మన్మోహన్ సింగ్ ఢిల్లీలో ఆవిష్కరించారు. సైద్ధాంతిక చర్చలు నిరంతరం జరుగుతున్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని ఆయన చెప్పారు. ఈ పుస్తకం చదువుతుంటే తనకు కేంబ్రిడ్జిలో రోజులు గుర్తుకు వస్తున్నాయని, వృత్తిపరంగా రాజకీయ నాయకుడు అయినప్పటికీ ప్రస్తుత సంక్షోభాలకు కొత్త పరిష్కారాలను అన్వేషించిన మేధావిగా జైపాల్ గుర్తింపు పొందారని మన్మోహన్ సింగ్ అన్నారు.పాత సంవత్సరం గడిచి కొత్త సంవత్సరం ప్రవేశిస్తున్న వేళ కొత్త ఏడాదిలో మన్మోహన్ సింగ్ లాంటి వ్యక్తులు లేరన్న విషయం గుర్తుకు వచ్చి ఎంతో బాధ కలుగుతుంది. ప్రతి ఏడాదీ వ్యక్తులనే కాదు, చరిత్రల్నీ, సంప్రదాయాల్నీ, విలువల్నీ కూడా తుడిచిపెడుతుంటుంది. మన్మోహన్ సింగ్ ఏనాడూ మీడియాతో మాట్లాడేందుకు వెనుకాడేవారు కాదు. ఆయనతో రెండు మూడు సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయన ప్రత్యేక విమానంలో ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పరిచయం చేసుకుని పలకరించడమే కాదు. అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం ఇచ్చిన సందర్భాలు మరిచిపోలేనివి.ఆధునిక భారతదేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పాత్ర విస్మరించలేనిది. కాంగ్రెస్‌లో తన కంటే సీనియర్ లైన పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం, ఎకె ఆంటోనీ లాంటి మేధావులు ఎందరో ఉన్నప్పటికీ మన్మోహన్ సింగ్ ఆ పార్టీలో ప్రవేశించిన కొద్ది రోజులకే వారితో పాటు ఇమిడిపోయారు. జైపాల్ మాదిరే ఆయన కాంగ్రెస్ మేధావిగా గుర్తింపు పొందారు. మన్మోహన్ సింగ్ మరణించిన తర్వాత ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే కాదు, దేశంలోనే భావదారిద్ర్యం ఏర్పడిందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మేధావులను, ఆలోచనాపరులను ప్రోత్సహించి వారి ద్వారా ఎంతో కొంత ప్రయోజనం పొందే సంస్కృతిని పార్టీలు కోల్పోతున్నాయి. వారికి బదులు వేల కోట్ల డబ్బులు ఖర్చులు పెట్టి ఎమ్మెల్యేలను గెలిపించే నేతలు, వ్యూహకర్తలు ఉంటే సరిపోతుందన్న భావన ఇప్పుడు పెరిగిపోతోంది.

# రైతు భరోసా విషయంలో..

## రైతులను నేరస్తులుగా భావించడం దారుణం : హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

### నేను శిక్షార్హుడినని రేవంత్ సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలంటున్నాడు..

అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా రైతుబంధు ఇవ్వలేదన్నారు. ప్రతిపక్షంలో ఉంటే ఒక మాట అధికారంలో ఉంటే ఒక మాట.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాలుకకు నరం లేదు.. ఏదైనా మాట్లాడుతాడని.. అధికారంలోకొస్తే ఏదైనా మరచిపోతారని ధ్వజమెత్తారు. రుణమాఫీకి షరతులు పెట్టి సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద అన్ని రికార్డులు ఉన్నాయని.. ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులతోనే కేసీఆర్ 11 సార్లు రైతుబంధు రైతులకు ఇచ్చారన్నారు. రైతు భరోసాకు రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిందేనన్నారు. 'నేను ఇస్తున్న సమాచారం అంతా సరైందేనని.. తప్పుడు సమాచారం ఇచ్చినా.. తప్పుడు లెక్కలు తేలినా మీరు తీసుకోబోయే చర్యలకు నేను శిక్షార్హుడిని' అని రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి అంటున్నాడని ఆరోపించారు.

### రైతులను అవమానపరచడం కాదా?

దేశానికి అన్నం పెట్టే రైతు ఎండనక వాననక ఆరుగాలం కష్టపడి అందరికీ అన్నం పెట్టే రైతుకు షరతులు పెడతావా? అంటూ మండిపడ్డారు. బడా బాబులకు, పారిశ్రామికవేత్తలకు ఎలాంటి షరతులు లేకుండా వేలకోట్లు మాఫీ చేస్తారని.. రైతులంటే షరతులు వస్తున్నాయంటూ విమర్శించారు. రైతులకు బేడీలు వేసి అవమానించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. రైతు భరోసా విషయంలో కూడా రైతులను నేరస్తులుగా భావించడం దారుణమన్నారు. అన్నదాతలంటే అంత అలుసు ఎందుకు రేవంత్ రెడ్డి నీకు అంటూ నిలదీశారు. రుణమాఫీ కోసం రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పారని.. ఇప్పుడు రైతు భరోసా కోసం మళ్లీ పైరవీకారుల చుట్టూ కాంగ్రెస్ నాయకులు చుట్టూ తిరగాలని మీరు చూస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతుల కడుపులో చల్ల కదలకుండా.. ఇంట్లో నుంచి కాలుబయట పెట్టకుండా రైతుబంధు డబ్బులు నేరుగా బ్యాంకులో పడ్డాయని గుర్తు చేశారు. కానీ, రేవంత్ రెడ్డి పైరవీకారుల చుట్టూ కాంగ్రెస్ నాయకులు చుట్టూ రైతులను తిరిగేలా చేస్తున్నాడని విమర్శించారు.

### ఎకరానికి రూ.15వేలు ఇవ్వాల్సిందే..

కేసీఆర్ గతంలో ఇచ్చిన విధంగా రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అధికారంలోకి వస్తే తాము రూ.15వేలు ఇస్తామన్నారని గుర్తు చేశారు. వానాకాలం, యాసంగి కలిపి ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. సంగారెడ్డిలో ఎక్కువ పండే ఎక్కువ సాగవుతుందని.. పత్తిని సాగు చేసే రైతులకు పెట్టుబడి సహాయం ఒకేసారి ఇస్తామని ప్రభుత్వం లీకులు ఇస్తున్నదన్నారు. ఏడు, ఎనిమిది నెలలు సాగు చేసే పంటలలకు పసులు, అల్లం, పత్తి రైతులకు ఒకేసారి రైతుభరోసా ఇస్తామంటే రైతుల కడుపుకొట్టడమేనన్నారు. వానకాలంలో కోటి నలభై వేల ఎకరాలు సాగవుతాయని.. యాసంగి కొచ్చేటప్పటికి 50 లక్షలు ఎకరాల్లో పత్తి సాగు చేసే రైతులు చేయరన్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, నల్గొండ జిల్లాలో పత్తి

# సమస్య ఉంటే వస్తారు.. ఎన్నికల్లో మాత్రం పట్టించుకోరు: రాజ్ ఠాక్రే

ముంబయి: మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన అధినేత రాజ్ ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైనా సమస్య పరిష్కారానికి తమ పార్టీ ఎమ్ఎన్ఎస్‌ను ఆశ్రయించేందుకు మొగ్గు చూపిన ప్రజలు ఓటింగ్ సమయంలో మాత్రం విస్మరిస్తున్నారని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు.

"ఏదైనా సమస్యకు పరిష్కారం కావాలనుకున్నప్పుడు ప్రజలు మా పార్టీ గురించి ఆలోచిస్తారు. కానీ, ఎన్నికల రోజు మాత్రం పట్టించుకోవడం లేదు. అయితే.. ఎన్నికల ఫలితాలను పట్టించుకోకుండా ముందుకు సాగాలి" అని రాజ్ ఠాక్రే పోస్టు చేశారు. త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ శ్రేణులకు నూతన సంవత్సరం సందర్భంగా తెలిపారు.

కాగా.. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలుండగా 230 సీట్లను గెలుచుకుని మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే.. 125 స్థానాల్లో ఎమ్ఎన్ఎస్ పోటీ చేసింది. కానీ, ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ముంబయిలోని మాహిం స్థానం నుంచి బరిలోకి దిగిన రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ ఠాక్రే సైతం ఓటమి చవి చూశారు.



# అనంత్ అంబానీ వాచ్.. అమ్మో అంత ఖరీదా..?

ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ముకేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ తాజాగా ధరించిన వాచ్ ధర వామ్మో అనిపిస్తోంది.

ఇంటర్నెట్‌డెస్క్: అనంత్ అంబానీ కి వాచ్‌లపై మక్కువ ఎక్కువ. ఆయన వద్ద ఖరీదైన వాచ్‌లకు కొదవలేదు. తాజాగా ఆయన ధరించిన చేతి గడియారం ధర తెలిస్తే అవాక్కవ్వాల్సిందే..!

ఇటీవల తన భార్య రాధికతో కలిసి అనంత్ బయట కనిపించారు. అప్పుడు ఆయన చేతికున్న వాచ్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఐస్‌క్యూబ్ మాదిరిగా నీలం రంగులో డయల్‌తో మెరిసిపోయింది. రిచర్డ్ మిల్లే బ్రాండ్‌కు చెందిన దాని ధర రూ.22 కోట్లని జాతీయ మీడియా కథనాలు



వెల్లడించాయి. అనంత్ ధరించిన తరహా వాచ్‌లు కేవలం మూడే తయారు చేసినట్లు సమాచారం. చేతి గడియారాలపై అమితాసక్తి ప్రదర్శించే ఈ అంబానీ వారసుడు అందులో ఒకదాన్ని సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇవేగాక, పటెక్ ఫిలిప్పె, అడెమార్స్ పిగ్యుట్ వంటి పలు బ్రాండ్ల మోడళ్లకు చెందిన వాచ్‌ల కలెక్షన్ ఆయన వద్ద ఉంది. అప్పుడప్పుడు వాటిని ధరిస్తూ కనిపిస్తుంటారు.

ఇదిలాఉంటే.. కొన్నినెలల క్రితమే అట్టహాసంగా అనంత్-రాధిక వివాహం జరిగింది. కొంతకాలంపాటు జరిగిన వేడుకలతో అంబానీ కుటుంబం పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగింది. ఆ పెళ్లి నిమిత్తం వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినట్లు పలు కథనాలు వెల్లడించాయి. వివాహానికి హాజరైన తన స్నేహితులు, ఆత్మీయులకు అనంత్ అంబానీ అత్యంత ఖరీదైన వాచీలను కానుకగా అందజేసిన దృశ్యాలు అప్పట్లో వైరల్ అయ్యాయి. అడెమార్స్ పిగ్యుట్ బ్రాండ్‌కు చెందిన ఆ వాచీ ధర సుమారు కోటిన్నర నుంచి రూ.2 కోట్లు ఉంటుందని అంచనా.

# సకల హంగులతో విశాఖ క్రూజ్ టెర్మినల్

విశాఖపట్నం: విశాఖను అంతర్జాతీయ పర్యాటక యవనికపై నిలిపే క్రూజ్ టెర్మినల్ పూర్తి హంగులతో సిద్ధమైంది. వైజాగ్ ఇంటర్నేషనల్ క్రూజ్ టెర్మినల్ (ఐసీటీ)గా పిలిచే దీన్ని రూ.96.05 కోట్లతో కేంద్ర పర్యాటకశాఖ (రూ.38.50 కోట్లు), విశాఖ పోర్టు ట్రస్ట్)రూ.57.55 కోట్లు సంయుక్తంగా నిర్మించాయి. దీన్ని నౌక ఆకారంలో, రెండువేల మందిని తీసుకెళ్లగల సామర్థ్యం గల క్రూజ్‌లు నిలిపేందుకు వీలుగా సిద్ధం చేశారు. కస్టమ్స్ అండ్



ఇమ్మిగ్రేషన్ సేవా కౌంటర్లు, రిటైల్ అవుట్‌లెట్‌లు, డ్యూటీఫ్రీ షాపులు, ఫుడ్ కోర్టులు, లాంజ్‌లతో టెర్మినల్ సిద్ధమైంది. 2023 సెప్టెంబరులో దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. 2024 ఏప్రిల్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద లగ్జరీ క్రూజ్ షిప్ ద వరల్డ్ ఇక్కడికి వచ్చింది. 2025 మార్చి నుంచి ఇక్కడ పూర్తిస్థాయి కార్యకలాపాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కార్డిలియా, రాయల్ కరేబియన్, ఎంఎస్‌సీ వంటి ప్రముఖ క్రూజ్ లైనర్లతో అధికారులు చర్చలు జరుపుతున్నారు. సింగపూర్, థాయిలాండ్, శ్రీలంక సహా వివిధ దేశాలకు, చెన్నై, సుందర్‌బన్స్ వంటి ప్రాంతాలకు ఇక్కడి నుంచి క్రూజ్‌లు నడిపేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

# కొత్త సంవత్సరం వేళ.. ఆ నగరంలో 18 వేల ట్రాఫిక్ ఉల్లంఘనలు!

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ముంబయిలో భారీగా ట్రాఫిక్ ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి.

ముంబయి: కొత్త సంవత్సరం వేళ భారీ సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకునే విషయం తెలిసిందే. అయితే.. అదే సమయంలో వారు ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. ఇలా దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో కొత్త ఏడాది సంబరాల వేల పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి. ఒక్క రాత్రిలోనే 17,800 వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నగరంలో పోలీసులు బుధవారం తెల్లవారుజాము వరకూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి వద్ద నుంచి మొత్తం రూ.89.19 లక్షలను జరిమానాల రూపంలో విధించినట్లు చెప్పారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, సిగ్నళ్లు జంప్ చేయడం, డ్రంకన్ డ్రైవ్ కేసులు



వీటిల్లో ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా.. నగరంలో 8 మంది అదనపు కమిషనర్లు, 29 మంది డిప్యూటీ కమిషనర్లు, 53 మంది అసిస్టెంట్ కమిషనర్లు, 2,184 మంది ఇన్‌స్పెక్టర్లు, 12 వేలకుపైగా కానిస్టేబుళ్లు రోడ్లపై విధులు నిర్వర్తించారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

# ఈ ఏడాది ఉప ఎన్నికలు రావొచ్చు..

## సంచలన వ్యాఖ్యలు చేసిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

అందులో భాగంగా ఫార్ములా ఈ రేసు కేసుతో ఆరో విఫల యత్నం చేశారని కేటీఆర్ ఆరోపించారు.

రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేయాల్సిందే..

ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో తనను అరెస్ట్ చేస్తే సీఎం రేవంత్ రెడ్డిని కూడా అరెస్టు చేయాల్సిందేనన్నారు. ఫార్ములా-ఈ రేసుకు అప్పుడు మంత్రిగా తాను అనుమతిస్తే.. ఇప్పుడు రద్దు చేశారన్నారు. తాను తప్పు చేస్తే రేవంత్‌రెడ్డిది ఒప్పు ఎలా అవుతుందని సూటిగా ప్రశ్నించారు. ఈ నెల 7న ఈడీ విచారణకు హాజరయ్యే విషయంపై న్యాయనిపుణులు నిర్ణయిస్తారన్నారని పేర్కొన్నారు తెలిపారు. తనకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందన్నారు. ఆర్ఆర్ఆర్ కాంట్రాక్టుల్లో రూ.12వేల కోట్ల అవినీతి జరుగుబోతోందని.. బడా కాంట్రాక్టర్ల నుంచి కాంగ్రెస్ నాయకులు రూ.వేల కోట్లు వసూలు చేసి ఢిల్లీకి పంపుతున్నారని ఆరోపించారు.

అక్టోబర్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎన్నిక

కేసీఆర్ ప్రజల్లోకి ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారని స్పష్టం చేశారు. కేసీఆర్ తమ ట్రంప్ కార్డ్ అని.. ఆయన ఎప్పుడు రావాలో.. ఆయనకు తెలుసునన్నారు. ఫిబ్రవరి, మార్చిలో పార్టీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. వేసవికాలం నుంచి పార్టీ సభ్యత్వ నమోదు ఉంటుందన్నారు. అక్టోబర్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని.. కేసీఆర్‌ను తాను పార్టీ అధ్యక్షుడిగా ప్రతిపాదిస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత దిల్ రాజు చేసిన వ్యాఖ్యలపై సైతం కేటీఆర్ స్పందించారు. దిల్ రాజుకు రెండు సినిమాలు ఉన్నాయని.. వాటి గురించే ఆయన బాధ అని వ్యాఖ్యానించారు.

# నగర వాసులకు తీపి కబురు.. మేడ్చల్, శామీర్‌పేట్‌కు మెట్రో పొడిగింపు

మొదటిపేజీ తరువాయి


పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్ల డీపీఆర్ తయారీ విషయంపై చర్చించి ఈ మేరకు సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు.

ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఆర్ఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రమ్‌పురి, కారా?నా, తిరుమలగిరి, లోతుకుంట, ఆల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్‌కు 22 కిలోమీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని మెట్రో ఎండీ.. సీఎంకు వివరించారు.

మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్ల రూట్ మ్యాప్‌లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం ప్రస్తావించారు. రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని మెట్రో ఎండీని సీఎం ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్లు మెట్రో ఎండీ తెలిపారు. మెట్రో ఫేజ్-2 'ఏ' భాగం మాదిరిగానే 'బి' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్లు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.

# సైబర్ నేరాలకు అడ్డా 'వాట్సప్'..

## హోంశాఖ నివేదిక



ఈ ఇంటర్నెట్ యుగంలో సైబర్ నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. రోజుకో కొత్త పంథాలో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. భారీ లాభాల పేరుతో ఆశజూపడం లేదా డిజిటల్ అరెస్టుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు గుంజుతున్నారు. ఈ మోసాలకు సైబర్ నేరగాళ్లు ఎక్కువగా మెసేజింగ్ ప్లాట్‌ఫాట్ 'వాట్సప్ 'నే వినియోగిస్తున్నారట..! ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఓ నివేదికలో వెల్లడించింది.వాట్సప్ వేదికగా స్కామర్లు ఎక్కువగా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని హోంమంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆ తర్వాత ఈ జాబితాలో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ఉన్నట్లు పేర్కొంది. 2023-24 సైబర్ మోసాల జాబితాను హోంశాఖ తాజాగా విడుదల చేసింది. 2024 తొలి మూడు నెలల్లో వాట్సప్ వేదికగా జరిగిన మోసాలకు సంబంధించి 43,797 ఫిర్యాదులు వచ్చినట్లు ఆ నివేదికలో వెల్లడించింది. ఇక, టెలిగ్రామ్‌లో మోసాలపై 22,680, ఇన్‌స్టా వేదికగా జరిగే నేరాలపై 19,800 ఫిర్యాదులు వచ్చాయని తెలిపింది.

ఈ నేరాల కోసం గూగుల్ సర్వీసెస్ ప్లాట్‌ఫామ్‌లను మోసగాళ్లు ఉపయోగిస్తున్నట్లు హోంశాఖ తెలిపింది. కొంతమందిని లక్ష్యంగా చేసుకుని ప్రకటనలు చేసేందుకు గూగుల్ అడ్వర్టైజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపింది. ఈ తరహా మోసాల కట్టడి కోసం తాము చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. డిజిటల్ లెండింగ్ యాప్‌ల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆయా సామాజిక మాధ్యమాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది.

కరపత్రం తెలుగు దిన పత్రిక
గురువారం జనవరి 2 2025

# తెలంగాణ వ్యాప్తంగా కరపత్రం క్యాలెండర్ విడుదల

**బ్యూరో చీఫ్, హైద్రాబాద్.**

2025 నూతన సంవత్సర కరపత్రం క్యాలండర్ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పంపిణీ జరిగింది.కరపత్రం తన శక్తి మేరకు కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా,కొన్ని ప్రాంతాల్లో తక్కువగా క్యాలండర్ పంపిణీ చేసింది.కరపత్రం చిన్నగా అయినా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నుకోబడిన చోట్లలో తన ఉనికిని ప్రదర్శించింది.గత 11 సం.ల క్రితం పరిమిత సర్కులేషన్ తో పక్షపత్రికగా పారంభమైన "కరపత్రం" క్రమంగా తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తున్నది.డిజిటల్ దినపత్రికగా నాణ్యమైన ఆర్టికల్స్, స్థానిక సెలెక్టెడ్ వార్తలతో తన ముద్ర వేసుకుంటున్నది.పాత ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు కొన్ని ప్రధాన పట్టణాల్లో ఉనికిని నెలకొల్పుకుంటూ సాగుతున్నది.2025 నూతన సంవత్సరం కరపత్రం క్యాలండర్ తెలంగాణ వ్యాప్తంగా పంపిణీ జరిగింది.హైద్రాబాద్ నగరంలో 4 డివిజన్లు, కొన్ని ప్రధాన చోట్లలో శ్రీ సాహిల్ ఆధ్వర్యంలో కరపత్రం క్యాలండర్ పంపిణీ జరిగింది.మహబూబ్ నగర్ కేంద్రంలో న్యూస్ ఏజంట్ల ద్వారా, పెబ్బేరు ఆలంపూర్ లో స్వయంగా,వనపర్తిలో సిబ్బంది ద్వారా శ్రీ బాలవర్ధన్ కరపత్రం క్యాలండర్ పంపిణీ చేసారు.ఖమ్మం జిల్లా కేంద్రంతో పాటు కొత్తగూడెం, పాల్వంచలో శ్రీ హరి కుమార్.వరంగల్ కేంద్రంతో పాటు జనగాం,ములుగు లో శ్రీ వీరేష్ ,తొర్రూరులో శ్రీ జంపన్న.నల్గొండ, సూర్యాపేటలో శ్రీ మధు కుమార్.మెదక్, సంగారెడ్డి తో పాటు సిద్దిపేట లో కొద్ది ప్రాంతాల్లో శ్రీకుమార్.పాత రంగారెడ్డి జిల్లాలోని మేడ్చల్, వనస్థలి పురం, శామీర్ పేట లో శ్రీ కరుణాకర్.నిజామాబాద్, కామారెడ్డి,ఆర్మూర్, భోధన్ లో శ్రీ సాయికృష్ణ.ఆదిలాబాద్, నిర్మల్,మంచిర్యాల,ఖానాపూర్ లలో శ్రీ శ్రీనివాస్, శ్రీ రమేష్, శ్రీ వెంకటేష్,శ్రీ రాజేశ్వర్.కరీంనగర్, పెద్దపెల్లి, గోదావరిఖని, సిరిసిల్ల లో కొద్దిమేర శ్రీ వేణుగోపాల్. మెటుపల్లి, కమ్మర్ పల్లి లో శ్రీ మారంపల్లి సత్యం, కోరుట్లలో శ్రీ ఆకుల రంజిత్ ఆధ్వర్యంలో కరపత్రం క్యాలెండర్ల పంపిణీ జరిగింది.మొదటగా నియోజక వర్గాలలో,క్రమంగా మున్సిపల్ కేంద్రాలలో కరపత్రం తన ప్రతినిధులను, రిపోర్టర్లను నియమించుకుంటూ ముందుకు సాగాలనే ప్రణాళికలతో పనిచేస్తున్నది.ప్రింట్ మీడియా, డిజిటల్ మీడియా తో సాగుతున్న వార్తా ప్రపంచ రంగంలో "కరపత్రం" తన ఉనికిని నెలకొల్పుకుంటూ తన ప్రయాణం ప్రారంభించింది.కరపత్రం తన ప్రయాణంలో మీ తోడును కోరుకుంటూ 2025 నూతన క్యాలండర్ సంవత్సర శుభాకాంక్షలు అందిస్తున్నది.కరపత్రం వాణిజ్య ప్రకటనల్లో ఒక కొత్త ఒరవడిని ప్రవేశ పెడుతున్నది.స్థానికంగా మాత్రమే ప్రచారం అవసరమున్న ప్రకటన దారుల కొరకు ఆర్థిక భారం లేని విధంగా కరపత్రం యాడ్ ప్రింటింగ్ సౌకర్యం కల్పించబోతున్నది. ఒక చిన్న పాంప్ లెట్ ప్రింటింగ్ కొరకు ఎంత ఖర్చు అవుతుందో, అంతే మొత్తం ఖర్చుకు ప్రచార వెసులుబాటు ప్రణాళిక సిద్ధం చేసింది కరపత్రం.ఏ పత్రికా అందించలేని తక్కువ ఖర్చు ప్రకటనా టారిఫ్ కరపత్రం రూపొందించింది.కేవలం డిజిటల్ ప్రచారం మాత్రమే కాదు.ప్రింట్ లో ప్రచారం కల్పించి చిన్నా పెద్దా వ్యాపారులకు, సామాజిక రాజకీయ ప్రకటనలకు, శుభాశుభ ప్రకటన దారులకు భారం లేని ప్రచారం కల్పించబోతున్నది కరపత్రం.కరపత్రం వార్తా సంచలనం కొరకు ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టదు.కరపత్రం ప్రతినిధులు వార్తా ప్రచురణల కొరకు ఎవ్వరి నుండి ప్రతిఫలం ఆశించరు.



**కరపత్రం వ్యక్తిగత విమర్శలకు అవకాశమివ్వదు.**
కానీ, వ్యవస్థ లోపాలను,ఆచరణ తడబాట్లను ఎత్తి చూపుతూ, సహేతుక సూచనలతో కరపత్రం తన సామాజిక బాధ్యత తో సాగుతుంది.

**కరపత్రం స్వాభిమానంతో సాగుతుంది.**
ఇది ఏ ఒక్కరి కరపత్రం కాదు.ఏ ఒక్కరి జేబు సంస్థగా మారదు.

**ఇది ప్రజల కరపత్రం..**
ఇది ప్రజల చేతి పత్రికగా సగర్వంగా సాగుతుందని తెలియజేస్తూ, మా ఈ కరపత్రం ప్రయాణంలో మీ అందరి సహకారం ఆశిస్తూ ప్రజలందరికీ 2025 నూతన క్యాలండర్ సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేస్తున్నాము.

# కోరుట్లలో పురాణ ప్రవచన కార్యక్రమం

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

నిన్నటి నుండి జనవరి 7 వ తేదీ వరకు వాసవి కళ్యాణ భవనం కోరుట్ల లో సనాతన ధర్మ ప్రచారం సమితి ఆధ్వర్యంలో "అష్టాదశ పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞం ప్రారంభమయ్యింది.ధర్మో రక్షతి రక్షితః.. ఈ విశ్వానికి ధర్మమే మూలం. అట్టి ధర్మాచరణ విషయాలన్నింటినీ వేద వ్యాస మహర్షి పద్దెనిమిది పురాణాల ద్వారా సమాజానికి అందించారు.లోక కళ్యాణం కోరే మన పురాణ విజ్ఞానాన్ని మనం తెలుసుకోవడం తో పాటు వచ్చే తరాలకు ఈ జ్ఞానాన్ని అందించడం మనందరి బాధ్యత.పూర్వం నైమిశారణ్యం లో శౌనకాది మహా మునులకు సూత మహర్షి ద్వారా చెప్పబడిన 18 పురాణాల ప్రవచనంతో మన కోరుట్ల పట్టణమే నైమిషారణ్యంగా సుప్రసిద్ధ పౌరాణికులు బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ గారి ద్వారా మారబోవుచున్నదని సనాతన ధర్మ ప్రచార సమితి



అధ్యక్షులు శ్రీ మంచాల జగన్,ప్రధాన కార్యదర్శి శ్రీ బట్టు హరికృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు.ఒక్క పురాణ శ్రవణం దొరకడమే ఎంతో పుణ్య ఫలం. ఎన్నో జన్మల పుణ్య ఫలంగా మన కోరుట్ల పట్టణంలో లభిస్తున్న ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. తేది 1-1-2025 బుధవారం నుండి 7-1-2025 మంగళ వారం వరకు ప్రతీ రోజు సాయంత్రం 6 గ.నుండి 7-30 వరకు పద్దెనిమిది పురాణాలలో ఒకటి శ్రీ బ్రహ్మ వైవర్త మహా పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞం వాసవి కళ్యాణ భవనంలో జరుగుతున్నదని,కావున జిజ్ఞాసులైన ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయగలరని జ్ఞాన యజ్ఞ నిర్వహణ కమిటీ, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ పడిగెల శ్రీనివాస్, కన్వీనర్ మోటూరి రాజు, సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, ఉపాధ్యక్షులు డాక్టర్ వేముల ప్రభాకర్, డాక్టర్ గంద్ర దిలీప్ రావు, కార్యదర్శులు వనపర్తి చంద్ర మోహన్,రాచమడుగు శ్రీనివాస్ రావు, DSV రాజన్, పిన్నంశెట్టి భాను మూర్తి, బోగ శ్రీధర్, వోడ్నాల రామ రావు తదితరులు కోరారు.

## మంథని నియోజకవర్గ మరియు పెద్దపల్లి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన

మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు...



**కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 1**
మంథని నియోజకవర్గ ప్రజలకు, మరియు జిల్లా వాసులందరికి హృదయ పూర్వక 2025 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు...ఈ కొత్త సంవత్సరములో ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, మరింత ఉన్నత స్థాయిలో గడపాలని అ భగవంతుని మనస్పూర్తిగా కోరుకుంటూ మరోసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు మా ప్రభుత్వం తరుపున, ప్రతి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల తరుపున శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.

# ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టిన తాగుబోతులు

## మత్తులో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**




NEW YEAR వేడుకలు.. కంపు కంపు చేశారు
HYD ఉప్పల్ మున్సిపల్ స్టేడియం డంపింగ్ యార్డును తలపిస్తోంది. న్యూ ఇయర్ సందర్భంగా నిన్న కొందరు వేడుకలు నిర్వహించారు. ఇవాళ ఉదయం వాకింగ్‌కు వెళ్లిన స్థానికులు అక్కడి పరిస్థితి చూసి షాకయ్యారు. ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు, తిని పడేసిన మాంసం ముక్కలు, పేపర్ ప్లేట్లు, వాటర్ గ్లాసులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దీంతో ఇక్కడ మద్యం పార్టీకి పర్మిషన్ ఇవ్వడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి.

SHOCKING.. ఎంత తాగావు బ్రో?
HYD బంజారాహిల్స్‌లో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో షాకింగ్ రీడింగ్ నమోదైంది. వెంగళరావు పార్క్ సమీపంలో నిన్న రాత్రి 10.50 గంటల సమయంలో బైక్(TS09EK3617)పై వెళ్తున్న వ్యక్తిని ఆపి బ్రీత్ ఎనలైజర్ టెస్టు చేశారు. అందులో 550 రీడింగ్ వచ్చింది. దీంతో రీడింగ్ చలాన్ ఫొటో సోషల్ మీడియాలో వైరలవుతుండగా, ఎంత తాగావు బ్రో అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 30 దాటితే కేసు నమోదు చేస్తారు.

2024 డిసెంబర్ 31వ తేదీన కరపత్రం లో రాసిన "తాగండి బాబూ తాగండి" అనే వ్యంగ్య వార్త నిజమయ్యింది. మత్తులో కొత్త సంవత్సరానికి మందు బాబులు మద్యంతో స్వాగతం పలికారు. ప్రభుత్వ ఆకాంక్షను నిజం చేస్తూ తెలంగాణ జనం మద్యం కొనుగోళ్ల రికార్డు సృష్టించారు.ఓట్లేసి గెలిపించిన తమ ప్రభుత్వం కలిగించిన తాగుడు వెసులుబాటును సంపూర్ణంగా ఉపయోగించుకున్నారు.న్యూ ఇయర్ వేళ రాష్ట్రంలో మద్యం ఏరులై పారింది. మందుబాబులు మద్యాన్ని మంచినీళ్లలా తాగేశారు. రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరగటంతో సర్కార్‌కు కాసుల వర్షం కురిసింది.చరిత్రలోనే రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్‌శాఖ వర్గాలు వెల్లడించాయి.




హైదరాబాద్‌లో 1184 డ్రంక్&డ్రైవ్ కేసులు
హైదరాబాద్ నగర వ్యాప్తంగా గత అర్ధరాత్రి 1184 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈస్ట్ జోన్‌లో అత్యధికంగా 236, సౌత్ ఈస్ట్ జోన్‌లో 192, వెస్ట్ జోన్‌లో 179, నార్త్ జోన్ 177, సెంట్రల్ జోన్ 102, సౌత్ వెస్ట్ జోన్‌లో 179 కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. న్యూ ఇయర్ సందర్భంగా అర్ధరాత్రి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసిన సంగతి తెలిసిందే.

**తెలంగాణలో ఒక్క మంగళవారం రోజునే సుమారు రూ.403 కోట్ల మద్యం విక్రయాలు జరిగనట్లు తెలిపార్ను**

**డిసెంబర్ 28 నుంచి జనవరి 1 ఉదయం వరకు కేవలం 5 రోజుల్లోనే దాదాపు రూ.1,800 కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు మంచినీళ్లలా తాగేసినట్లు ఎక్సైజ్‌శాఖ వర్గాలు తెలిపాయ్ను**

గతంతో పోల్చితే ఈసారి మద్యం అమ్మకాలు భారీగా పెరిగినట్లు మద్యం షాపుల యాజమన్యాలు సైతం చెబుతున్నాయి.సాధారణ రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి.
వీకెండ్స్‌లో ఈ లెక్క రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ ఉంటుంది. డిసెంబర్ నెల చివరి వారంలో మాత్రం మద్యం అమ్మకాలు డబుల్ అయ్యాయి. 2024 డిసెంబర్ 31న ఒక్క రోజే రాష్ట్ర వ్యాప్తంగా రూ.402 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు మత్తు మత్తుగా వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా 2,620 మద్యం షాపులు, 1,117 బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్ ఉండగా.. ఆయా దుకాణాలకు 19 డిపోల నుంచి బేవరెజ్ సంస్థ మద్యం సరఫరా చేస్తోంది.కాగా, డిసెంబర్ నెలలో మద్యం ద్వారా సర్కారుకు కాసుల వర్షం కురవగా.. రికార్డు స్థాయిలో లిక్కర్ సేల్స్ జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఈ ఒక్క నెలలోనే 3,82,265 కేసుల లిక్కర్, 3,96,114 కేసుల బీర్ల అమ్మకాలు జరిగినట్లు తెలిపారు.2022 డిసెంబర్‌లో రూ.3,100 కోట్ల లిక్కర్ సేల్స్ జరగ్గా, 2023లో 4,292 కోట్ల విక్రయాలు జరిగాయి. 2024 డిసెంబర్ 30 వరకు రూ.3,662 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని అధికారులు తెలిపారు. డిసెంబర్ 31ని కలుపుకుంటే దాదాపు 4 వేల కోట్ల మద్య విక్రయాలు జరిగాయి. కాగా, గతేడాది కంటే కాస్త తక్కువగా మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.ప్రభుత్వం ప్రజలకు ఉరఫ్ తాగుబోతులకు మద్యం తాగించి ఆదాయం పెంచితే, మరోపక్క పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో భారీగా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చారు.ఇలా ఎడా పెడా తాగుబోతుల టాక్స్ వల్ల సమకూరే ఆదాయం అన్ని పథకాల నిర్వహణకు ఉపయోగపడతాయని, ప్రభుత్వాలు ఇలా ప్రభుత్వాన్ని నడిపే పద్ధతి బాగుందని పనిలేని మేదావులు అభిప్రాయ పడుతున్నారు.ప్రభుత్వం కల్పించిన ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకున్న ఒక భాధ్యత గల పౌరుడు పంజాగుట్టలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో అత్యధిక స్కోరు సాధించాడు.30 మార్కుల సూచి సాధించి తాగుబోతు పరీక్ష నెగ్గే అవకాశమున్నా, అత్యధిక 550 స్కోర్ తో ఉత్తమ తాగుబోతు అవార్డు దక్కించుకున్నాడు.పోలీసులు ఇటువంటి ఉత్తమ తాగుబోతుల మార్కుల లిస్ట్ జారీ చేసి పోటీ పెంచితే బాగుంటుందని జనాభిప్రాయం.చైతన్య,నారాయణ లాంటి కాలేజీల్లో 1 2 1 2 4 7 8 9 అంటూ ర్యాంకులు సాధించిన ఉత్తమ విద్యార్థుల లిస్ట్ చదివినట్టు, ప్రభుత్వం కూడా ఇలా ఉత్తమ తాగుబోతుల ర్యాంకులు ప్రకటిస్తే బాగుంటుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.దీనివల్ల తాగుబోతుల పోటీ పెరిగే అవకాశముంటుందని విజ్ఞుల సలహా.హైద్రాబాద్ తర్వాత బెంగళూరు కూడా ఈ పోటీలో ముందున్నది. ఇలా ఈ జంట రాష్ట్రాలను తాగుబోతుల అభివృద్ధి సూచీలో దేశంలోనే ముందుంచేలా తాగుబోతు దేవుణ్ణి ప్రభుత్వ అధినేతలు ప్రార్థించాలి.ఇటువంటి తాగుబోతుల అభివృద్ధి పథకాల పట్ల ఆ తాగుబోతు దేవదేవుని ఆశీర్వాదం తప్పకుండా ఉంటుందని ఆశిద్దాం.

# గొనెల గానం యూట్యూబ్లో కొమ్మిరెడ్డి జ్యోతక్క పాట ఆవిష్కరణ...

- ప్రజా కవి,గాయకులు గోనెల సమ్మన్న...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 1.**
మెట్ పెల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క నవంబర్ 8, 2024న పరమపదించగా, వారి స్మారకార్థం తమ కార్యకర్తలు, అభిమానులు కంతి హరికుమార్ ,చందా పెద్దకాశిరెడ్డి, తేలు నరేష్, బాల్సాని సుమ, చందా చిన్న కాశిరెడ్డి ,చిలువేరి సత్యమ్మ, నానం రాకేష్ లు ఆమె పై పాటను పాడించి,వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి



చెందిన కవి ,గాయకులు, గోనెల సమ్మన్న ముదిరాజ్ రాసిన పాటను సమ్మన్న,గజ్జెల వినోద పాడినారు.నూతన సంవత్సరం సందర్భంగా మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు మేకల ఎల్లారెడ్డి చేతుల మీదుగా గోనెల సమ్మన్న ఇంటి వద్ద మల్లారెడ్డిపల్లిలో ఆవిష్కరించారు .గోనెల గళం యూట్యూబ్ ఛానల్ లో ప్రసారమవుతుందని సమ్మన్న తెలిపినారు. ఈ కార్యక్రమంలో గణేష్ కళాబృందం అధ్యక్షుడు, గాయకుడు గోనెల పెద్దన్న ముదిరాజ్, కోశాధికారి దూలం నరేష్, గంధం సుమన్,గంధం ప్రశాంత్ ,దూలం వెంకటేష్, పూదరి అనిల్, దూలం సురేష లు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్.

**హైదరాబాద్ జనవరి కరపత్రం**
Jbs (జూబ్లీ బస్ స్టాండ్) లో ప్రయాణికులతో ముచ్చటించారు..
బస్ స్టేషన్ లో టాయిలెట్స్ పరిశీలించారు..
రోడ్డు భద్రతా మాసంలో భాగంగా డ్రైవర్ లతో మాట్లాడి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించాలని సూచించారు..క్యాంటీన్ లో ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడారు.. క్యాంటీన్ లో నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు.
Jbs లో ఉన్న కార్గో సెంటర్ ను పరిశీలించారు..
రోజూ ఇక్కడి నుండి వెళ్ళే ప్రయాణికులు సంఖ్య కార్గో ,పార్శిల్ లు ఎన్ని తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు..
Jbs లో శానిటేషన్ సిబ్బంది తో మాట్లాడారు ... బస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండలని సూచించారు .
బస్ స్టేషన్ లో ఉన్న షాపులను పరిశీలించారు . షాపులలో



నాణ్యమైన ఆహార వస్తువులు ఉండాలని,కాలం చెల్లిన ఆహార వస్తువులు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు..
స్టాల్స్ లో అదనపు రేట్లకు వస్తువులు అమ్మరాదని ఒకవేళ అలాంటి పిర్యాదులు వస్తె చర్యలు తప్పవని హెచ్చరించారు..
డ్రింకింగ్ వాటర్ ను పరిశీలించారు.. ఫ్లాట్ ఫాం లను పరిశీలించారు .




ఫ్లాట్ ఫాం లపై డిస్ ప్లే బోర్డులు కనిపించే విధంగా ఉండాలని సూచించారు .
ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు..
మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ఇతర అధికారులు ఉన్నారు..


# ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఫలించింది

## ఉత్తర హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు కు లైన్ క్లియర్

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి**

నార్త్ హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు కు లైన్ క్లియర్ అయింది.తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేడు సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సిందిగా అధికారులను ఆదేశించారు.ప్యారడైజ్ నుండి మేడ్చల్ 23 కిలోమీటర్లు మరియు జేబీఎస్ నుంచి అల్వాల్ మీదుగా శామీర్ పేట 22 కిలోమీటర్ల వరకు మెట్రో రైలు ప్రాజెక్టు కు మోక్షం లభిస్తుందని మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఇటీవల మల్కాజిగిరి శాసన సభ్యులు





MARRI RAJASHEKAR REDDY
M.L.A.
44-Malkajgiri Constituency

Plot No. 69, Soujanya Colony,
New Bowenpally, Secunderabad - 11.
Cell : 9866520842, 9133999507
mlamalkajgiri2023@gmail.com

To,
Sri A. Revanth Reddy Garu,
Hon'ble Chief Minister,
Government of Telangana,
Hyderabad.

Lr No: 1503/ MLA, Malkajgiri /Dated: 19-12-2024

Sir,

Sub: - MLA, Malkajgiri- Urgent Inclusion of North Hyderabad in Metro Phase 2 Expansion Plans - Regarding.

I am writing to you as a representative of the Malkajgiri constituency, one of the most vibrant and densely populated areas in North Hyderabad.

As Hyderabad continues its remarkable urban expansion, it is imperative that balanced development and equitable connectivity across the city remain at the forefront of planning. Unfortunately, North Hyderabad has been overlooked in the proposed plans for Metro Phase 2 expansion, leaving a significant portion of the city's population underserved in terms of public transport options.

To address this pressing issue, I urge you to prioritize the inclusion of North Hyderabad in the upcoming metro expansion. The following areas and routes should be considered for development to alleviate traffic congestion and ensure seamless connectivity for the residents:

1. Paradise to Kandlakoya (22 km)
2. Tarnaka to Keesara (20 km)
3. Bowenpally to Gandimysamma (21 km)
4. JBS to Shamirpet (22 km)

These routes will not only provide much-needed relief to commuters but also stimulate economic growth, reduce traffic bottlenecks, and improve overall quality of life in the region. Expanding the metro network to cover Medchal-Malkajgiri and adjoining areas is critical for achieving these goals.

I strongly urge you to take decisive action to ensure North Hyderabad is not neglected in the Metro Phase 2 plans. Furthermore, I request that this expansion work be expedited, focusing on the most congested areas to address the immediate transportation needs of the citizens.

Your efforts in spear heading Hyderabad Metro Rail's expansion have already set a benchmark for modern public transportation systems

మర్రి రాజశేఖర్ రెడ్డి శాసన సభలో డిసెంబర్ 20 వ తేదీన 2 ఫేస్ ఉత్తర హైదరాబాద్ లో మెట్రో కనెక్టివిటీ పై ప్రశ్న అడిగారు.అదే విధంగా గౌరవ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని ప్రత్యేకంగా కలసి ఈ ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించి వినతి పత్రం సమర్పించారు. అదే విధంగా గతంలో మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని



కూడా ప్రత్యేకంగా కలసి ఈ ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించి వినతి పత్రం సమర్పించారుఆ సందర్భంగా గౌరవ ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని దరిమిలా ఈ ఉత్తర హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు కు మార్గం సుగమమైంది అని మర్రి రాజశేఖర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం సానుకూలంగా స్పందించి త్వరగా ఆదేశాలు ఇచ్చిన గౌరవ రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# 72 గంటల్లో అమెరికా రెండో రీపర్ డ్రోన్‌ను కూల్చిన హుతీలు

**అమెరికా జనవరి 1 కరపత్రం**
యెమెన్‌లో హుతీ రెబల్స్ అమెరికాకు చెందిన అత్యాధునిక ఎమ్క్యూ-9 డ్రోన్‌ను కూల్చారు. ఈ శ్రేణికి చెందిన డ్రోన్‌ను వారు కూల్చడం వరుసగా 72 గంటల వ్యవధిలో ఇది రెండోసారి. ఈ విషయాన్ని హుతీల ప్రతినిధి వెల్లడించారు. "72 గంటల్లో రెండో డ్రోన్‌ను మా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ కూల్చగలిగింది. ఈ యుద్ధంలో ఇటువంటి డ్రోన్‌ను కూల్చడం ఇది 14వ సారి" అని పేర్కొన్నారు. స్థానికంగా అభివృద్ధి చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ సాయంతోనే ఆ డ్రోన్‌ను కూల్చేసినట్లు వెల్లడించారు.
హుతీలు అంతర్జాతీయ సముద్ర మార్గంలోని నౌకలపై దాడులు చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా మిత్రపక్షలు, ఇజ్రాయెల్ నౌకలను లక్ష్యంగా చేసుకొంటున్న విషయం తెలిసిందే.హుతీలకు ఇజ్రాయెల్ తీవ్ర హెచ్చరికలు..
ఇటీవల ఐరాసలోని ఇజ్రాయెల్ ప్రతినిధి డానీ డానన్ మాట్లాడుతూ హుతీలను తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తమ దేశంపై క్షిపణి దాడులు ఆపకపోతే హమాస్, హెజ్‌బొల్లాకు పట్టిన దారుణమైన గతే పడుతుందని పేర్కొంది. పశ్చిమాసియాలో ఏ లక్ష్యంపైన అయినా దాడి చేయగల సత్తా తమ దేశానికి ఉందని పేర్కొన్నారు.
అంతకు కొద్ది గంటల ముందే టెల్ అవీవ్ సమీపంలోని బెన్ గురియాన్ ఎయిర్‌పోర్టుపై దాడికి హుతీలు తీవ్రంగా ప్రయత్నించారు. దీనిలో భాగంగా హైపర్‌సోనిక్ మిసైల్‌తోపాటు జుల్ఫికర్ బాలిస్టిక్ క్షిపణిని కూడా ప్రయోగించారు. ఆ తర్వాత కొన్ని గంటలకే అమెరికా



యుద్ధ నౌకల నుంచి యెమెన్‌లోని హుతీ స్థావరాలపై భారీగా దాడులు జరిగాయి.

## హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ లో జరగబోయే బీసీ మహాసభను విజయవంతం చేయండి




**హైదరాబాద్ జనవరి 1 కరపత్రం**
ఈ నెల మూడో తారీకు రోజున ఇందిరా పార్క్ దగ్గర సావిత్రి పూలే జన్మదిన సందర్భంగా జరగబోయే బీసీ మహాసభను విజయవంతం చేయాలని శాతవాహన యూనివర్సిటీ ముందు పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ నాయకులు నైతం మహేష్ గారు మాట్లాడుతూ బీసీ లో ఉన్న అన్ని కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని, సావిత్రిబాయి పూలే ఆశయాలను కాపాడే వారసుల్లాగా పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని కామారెడ్డిలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని మాట ఇచ్చిన ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకునేలా చూడాలని ఈ సభతో ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసే విధంగా ఈ సభను విజయవంతం చేయాలని వారు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోడకుంట రమేష్, గోపతి అన్వేష్ ,వడ్లకొండ మనోహర్, శివ పవన్, అఖిల్,ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే తలసాని



**హైదరాబాద్ జనవరి 1 కరపత్రం**
మాజీమంత్రి, సనత్ నగర్ MLA తలసాని శ్రీనివాస్ యాదవ్ BRS పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ KTR కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్ లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## భారత్‌తో సంబంధాలు.. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ జనవరి 1 కరపత్రం**
అనేక విషయాల్లో బంగ్లాదేశ్ భారత్‌పై ఆధారపడి ఉందని ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్-ఉజ్-జమాన్ అన్నారు. భారత్ కూడా వివిధ సౌకర్యాలను తమ నుంచి పొందుతోందని..తమ ప్రభుత్వానికి భారత్ చాలా ముఖ్యమైన పొరుగుదేశమని పేర్కొన్నారు. న్యూదిల్లీ వ్యూహాత్మక ప్రయోజనాలకు విరుద్ధంగా తాము ఎటువంటి చర్యలు తీసుకోమన్నారు. అదే విధంగా భారత్



కూడా తమ ప్రయోజనాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఆశిస్తున్నామన్నారు.
సరిహద్దుల్లో ఇరుదేశాలకు సంబంధించిన సమస్యలను కలిసి పరిష్కరించాల్సి ఉంటుందని జమాన్ పేర్కొన్నారు. ఇందుకోసం ఇరుపక్షాల మధ్య సంబంధాలు సమాన హోదాతో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని కోరారు. భారతీయులు అనేకమంది బంగ్లాదేశ్‌లో ఉపాధి పొందుతున్నారని.. బంగ్లా ప్రజలు వైద్యసదుపాయాల కోసం భారత్‌కు వెళ్తుంటారని పేర్కొన్నారు. వాణిజ్యపరంగా ఇరుదేశాల మధ్య మంచి సంబంధాలున్నాయని అన్నారు. ఏదేశమైనా మరో దేశం నుంచి ప్రయోజనం పొందాలనుకుంటుందని..అది తప్పేమీ కాదని అన్నారు.
చిట్టగాంగ్ కొండ ప్రాంతాల్లో అశాంతి చెలరేగడాన్ని తాము అనుమతించబోమని అన్నారు. దేశంలో పరిస్థితులు అదుపులో ఉండాలంటే సైన్యం రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దని అన్నారు. ఇంతకు ముందు పరిపాలనలో జోక్యం చేసుకున్నందునే ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో యూనస్ ప్రభుత్వానికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.
రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్‌లో అల్లర్లు సృష్టించడంతో ఆ దేశ మాజీ ప్రధాని షేక్‌హసీనా పదవిని కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్-బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు బలహీనం అయ్యాయి. అయినప్పటికీ భారత్-బంగ్లాదేశ్ మధ్య సత్సంబంధాలను కొనసాగించాలని భావిస్తున్నట్లు ఇరుదేశాలు పేర్కొంటున్నాయి.

## ఆస్ట్రేలియా పేరెంట్ వీసా.. నిరీక్షణ గడువు 31ఏళ్లు

**ఆస్ట్రేలియా జనవరి 1 కరపత్రం**
ఆస్ట్రేలియా పేరెంట్ వీసా కోసం సుదీర్ఘ కాలం వేచిచూడాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రిబ్యూటరీ పేరెంట్ వీసా కోసం 14ఏళ్లు నిరీక్షించాల్సి వస్తుండగా.. జనరల్ పేరెంట్ వీసా కోసం 31ఏళ్లు ఆగాల్సి వస్తున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఇలా ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో గడిచిన మూడేళ్లలో 2300 మంది చనిపోయినట్లు ఆస్ట్రేలియా హోంమంత్రిత్వ శాఖ వెల్లడించింది.